నేడు విద్యుత్ సమస్యలపై సమావేశం

మేడిపల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్స్ సమావేశం నేడు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కీసర డివిజనల్ ఇంజినీర్ ఆఫీస్ ఆవరణ కెకె గార్డెన్ ఎదురుగా శిల్పానగర్ నాగారంలో పరిష్కార వేదికను ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ మెంబర్, టెక్నికల్ మెంబర్, ఫైనాన్స్ మెంబర్లు హాజరు కానున్నారు. వినియోగదారులు తమ సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చు తగ్గుల విషయంపై కూడా ఫిర్యాదు చేయొచ్చని, విద్యుత్ అధికారి కీసర డివిజనల్ ఇంజినీర్ లింగయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు

మౌలాలి : నూతనంగా సీసీరోడ్డు వేసి, క్యూరింగ్ చేయకుండా కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హనుమాన్‌నగర్‌లో వారం రోజుల క్రితం 220 మీటర్ల మేర సీసీ రోడ్డు వేశారు. రోడ్డుపై గట్టుపోసి రోజూ క్యూరింగ్ చేయాల్సి ఉండగా.. సంబంధిత కాంట్రాక్టర్ అవేవి పట్టించుకోకుండా వదిలేశాడు. దీంతో తామే క్యూరింగ్ చేశామని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

‘భవిష్యత్తు వాణిజ్య రంగానిదే’

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య దినోత్సవం

ఉప్పల్: ప్రపంచ వాణిజ్య దినోత్సవాన్ని ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. వాణిజ్యశాస్త్రంతో వివిధ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, మారుతున్న విజ్ఞానంతో పాటు నిర్వహించే కోర్సులు అందుకు ఏవి పాత్ర తదితర అంశాలను వివరించారు. వాణిజ్యశాస్త్రంలో కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.రవిప్రసాద్, డా.ఎస్. యమునారాణి, డా. ఎస్ రాజశ్రీ విశ్వనాథ్ వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వేంకటేశ్వరనగర్‌లో కలుషితనీటిసరఫరాను అరికట్టాలని స్థానికులు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. వేంకటేశ్వరనగర్ కాలనీలో జలమండలి జీఎం సునీల్‌కుమార్, ఏఈ నవీన్‌తో కలిసి పర్యటించి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సుమారు నెలరోజుల క్రితమే చాణక్యపురి రిజర్వాయర్‌లో డీజీఎంకు ఫిర్యాదు చేసేందుకు వెళితే పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. సమస్య పరిష్కారం కాలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. స్థానికులు రాజు, ఉమర్, కృష్ణవేణి, సంతోషి, యాదమ్మ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సొసైటీ డివిడెంట్లను వెంటనే చెల్లించాలి



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని మహిళా (డ్వాకా) సంఘాలను కీసర స్నేహ మహిళా సొసైటీ కీసర నుంచి రావాల్సిన డివిడెంట్లను వెంటనే చెల్లించేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఏ అధికారులకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నాగారం పరిధిలోని డ్వాక్రా సంఘాలు వరకు కీసర మహిళా సొసైటీలో 2018 వరకు కొనసాగాయని, అనంతరం నాగారంలోని బ్యాంక్‌లకు తమ సంఘాలను మార్చారన్నారు. స్నేహ సొసైటీలో ఉన్న ప్రతి ఒక్క సంఘానికి సొసైటీ లాభాలను రూ. 10 వేల చొప్పున డివిడెంట్లు ఇవ్వాలని, గతంలో సొసైటీ తీర్మానం చేసింది. కానీ నాగారం, రాంపల్లిలోని సంఘాలకు ఎలాంటి డివిడెంట్లు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని డ్వాక్రా సంఘాల అభ్యర్థన మేరకు సోమవారం జిల్లా కలెక్టర్, డీఆర్డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీజేపీ నేతలు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, రామక్కపేట రవీందర్‌రెడ్డి, జూపల్లి నరేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతిపాండే, జోరుక కృష్ణవేణి, విజయలక్ష్మి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బయటికి వెళ్లాలంటే వణుకే!

- గతుకులు, దుమ్ము, ధూళితో వాహనదారుల అవస్థలు
- తాత్కాలిక రోడ్డు వేయాలని ప్రజల విజ్ఞప్తి



గుంతలు పడి కంకర తేలిన ఉప్పల్ వరంగల్ రోడ్డు

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. ఉప్పల్ చౌరస్తా నుంచి బోడుప్పల్ కమాన్ వరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో ఇక్కడి ప్రజలు రోజూ నరకం అనుభవిస్తున్నారు. దాదాపుగా రెండున్నర కిలోమీటర్ల రోడ్డు దాటాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

పట్ట పగలే చుక్కలు..

రోడ్డుకు ఇరువైపుల రోడ్డంతా గుంతలమయంగా మారి నిత్యం వాహనదారులకు పట్ట పగలే చుక్కలు చూపిస్తోంది. ఉదయం సాయంత్రం వేళలో స్కూల్, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్డంతా వరద నీరు నిండి ఉండటంతో ఎక్కడ గుంత ఉందో.. తెలియక వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు.

మంత్రి పర్యటించినా మారని పరిస్థితి..

ఇటీవల కురిసిన వర్షాలతో పాటు సోమవారం కురిసిన వర్షానికి రోడ్డుపై గుంతలు, కంకర తేలి మరింత దారుణంగా తయారైంది. రెండుసార్లు మంత్రి పర్యటించిన రోడ్డు సమస్యను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే బురద, ఎండకు దుమ్ము..



వర్షం కురినప్పుడు బురద, ఎండ వస్తే దుమ్ముతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి. తాత్కాలికంగా రోడ్డుకు ఇరువైపుల బీటీ రోడ్డు వేయాలి.

– సుధాకర్ గుప్తా, వర్తక సంఘం ప్రతినిధి

ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు



రోడ్డు సరిగ్గా లేని కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురౌతున్నాయి. వర్షం వచ్చినప్పుడల్లా రోడ్డుపైనే వరదలా నీరు నిలిచిపోతోంది. ట్రాఫిక్ దృష్ట్యా స్వయంగా మా సిబ్బందే పలుగు, పారపట్టి వరద నీటిని తొలగిస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– నాగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

రూ.48 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో వరదనీటి సమస్య పరిష్కారానికి రూ.48 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ, రిటైనింగ్ వాల్ పనులకు సోమవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, స్థానిక కాలనీవాసులు కొత్త మల్లారెడ్డి, రంగారెడ్డి, కుంటికృష్ణ, స్థానిక నేతలు తండా వాసుదేవ్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, అల్లాడి కృష్ణ, ఉస్మాన్, విశ్వరూపచారి, మల్లేష్ పాల్గొన్నారు.

పలహార బండ్ల ఊరేగింపుతో ఆధ్యాత్మిక శోభ..



ఊరేగింపులో ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సంస్కృతి సాంప్రదాయాలతో ఆధ్యాత్మికను పెంపొందించడంలో బోనాల వేడుకలకు ఓ విశిష్టస్థానం ఉందని, ఫలహార బండ్ల ఊరేగింపుతో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఓల్డ్ మల్లాపూర్ శాంతి యూత్‌క్లబ్, అన్నపూర్ణ కాలనీలో పలహార బండి ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల నృత్యాల మధ్య పలహారం బండి ఊరేగింపు సాగింది.

- మల్లాపూర్ మల్లికార్జుననగర్ కాలనీలో అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. సూర్యం శివ, సంతుయాదవ్, ప్రతాప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



లేక్స్ అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రవణ్



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్

మల్కాజిగిరి: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజా ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. సోమవారం కార్పొరేటర్ శ్రవణ్ సఫిల్‌గూడ చెరువులోకి మురుగు చేరకుండా ఎస్టీపీ ప్లాంట్‌కు తరలించడానికి నిధులు మంజూరు చేయాలని అడిషనల్ కమిషనర్ లేక్స్ జ్యోతికి విజ్ఞప్తి చేశారు. బుద్ధభవన్‌లోని ఇరిగేషన్ విభాగం ఈఈతో సమావేశమై రూ.2 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అడిషనల్ కమిషనర్ గీతారాధికను కలిసి సికింద్రాబాద్ జోన్‌కు నిధులు మంజూరు చేయాలని, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌ను కలిసి అనుమతి లేకుండా సెల్ టవర్స్ ఏర్పాటు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

- మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కార్పొరేటర్ సునీత చిన్మయ స్కూల్ మార్గంలో వరదనీరు వెళ్లడానికి ప్రస్తుతం ఉన్న వెంట్ సరిపోవడం లేదని, వెంట్ విస్తరించాలని వినతిపత్రం అందజేశారు.
- మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్‌పటేల్‌నగర్‌లో నాలాపై నూతనంగా నిర్మిస్తున్న స్లాబ్ పనులు వెంటనే నిలిపేయాలని వినతిపత్రం అందజేశారు.
- కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో డివిజన్ పరిధిలో ఉన్న నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం ప్రధాన రహదారి నుంచి చంద్రగ్రాండ్ హోటల్ వద్ద 50 మీటర్ల డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సాయినగర్ కాలనీవాసులు సోమవారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకులంగా స్పందించిన కార్పొరేటర్ జలమండలి డీజీఎం సతీష్‌తో మాట్లాడారు.

మిగిలిన డ్రెయిన్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. సాయినగర్ కాలనీవాసులు శ్రీనివాస్, మధు, రాజా, వెంకటేశ్వర్‌రావు, అక్బర్, నవీన్, సునీల్, రాజు, సుధాకర్, చారి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమం నుంచి బాలుడి అదృశ్యం



భరత్

మేడిపల్లి: ఓ బాలుడు ఆశ్రమం నుంచి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డుపై తిరుగుతున్న 4 బాలురుని సీడబ్ల్యూసీ టీమ్ రెస్క్యూ చేసి పీర్జాదిగూడలోని మానసనగర్‌లోని మా ఫౌండేషన్‌లో ఆశ్రయం కోసం పంపించగా.. అందులో ఓ బాలుడు భరత్ (10) ఈనెల 3న ఉదయం 5.30 గంటల సమయంలో నిర్వాహకులు చూసేసరికి బాలుడు కనిపించలేదు. ఆశ్రమంలో వెతికినా కనిపించకపోవడంతో పారిపోయినట్లు గ్రహించారు. దీంతో వారు సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడిన యువకుడి రిమాండ్

మేడిపల్లి: నిషేధిత మత్తు పదార్థం అక్రమంగా సేవిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన కమల్‌కిషోర్(22) చెంగిచెర్లలో నివాసం ఉంటూ.. గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత కొంతకాలంగా నిషేధిత మత్తుకు(పాపిస్ట్రా పౌడర్)అలవాటు పడ్డాడు. సోమవారం మేడిపల్లిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. సుమారు 80 గ్రాముల నిషేధిత ‘పాపిస్ట్రా పౌడర్’ బయటపడింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య



క్రాంతి కుమార్ (ఫైల్)

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్‌లో నివాసం ఉండే సబ్బన్ క్రాంతికుమార్(32) వృత్తి ప్రైవేట్ ఉద్యోగి. కాగా ఆదివారం యథావిధిగా ఇంటి కొచ్చి గదిలో నిద్రకు ఉపక్రమించాడు. సోమవారం మధ్యాహ్నం వరకు బయటకు రాకపోవడంతో గది తలుపులు తట్టినా.. స్పందించకపోవడంతో తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్

మౌలాలి : డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ శ్మశానవాటిక అభివృద్ధి పనులను కాలనీవాసులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమవారం కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్మశానవాటిక అభివృద్ధికి కేటాయించిన రూ. 35 లక్షలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేపట్టలేమని, సుందరీకరణ, పచ్చదనం, విద్యుత్‌దీపాల ఏర్పాటుకు అర్బన్ బయోడైవర్సిటీ (యుబీడీ), విద్యుత్‌శాఖల సహాయ సహకారాలు కోరామన్నారు. అస్థికలు భద్రపరిచే గది, టాయిలెట్స్, ప్రహరీ ఎత్తు పెంపు, సీసీరోడ్డు, ఫుట్‌పాత్, బెంచ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను సూచించారు. కాలనీవాసులు బిక్షపతి, నర్మద, రేఖ, లత, రేణుక, మాజీ ప్రెసిడెంట్ సాయిబాబా, ఆర్‌కేహెచ్ కాలనీ ప్రెసిడెంట్ పోశెట్టి మల్లారెడ్డి, బండ మహేష్, జీహెచ్ఎంసీ విభాగాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ‘పెద్ద పండుగ’



భవిష్యవాణి చెబుతున్న ఏర్పుల విజయ్

బోడుప్పల్: బోనాల ఉత్సవాల్లో భాగంగా బోడుప్పల్‌లో పెద్ద పండుగ నిర్వహించారు. సోమవారం జరిగిన పండుగలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగం కార్యక్రమంలో భవిష్యవాణి ఏర్పుల విజయ్ పాల్గొన్నారు. ‘బోడుప్పల్‌లో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునేలా బాధ్యత నాదేనని, ప్రతిఏటా మొక్కులు చెల్లించుకుని వైభవంగా చూస్తున్నారని, పిల్లాపాపలను కాపాడుకునేందుకు ఎల్లవేళలా అండగా ఉంటానని’ భవిష్యవాణి చెప్పారు. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు బొబ్బల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఐతే ఎలా.. ?

బోడుప్పల్: వర్షం పడినప్పుడల్లా మల్లయ్యనగర్, వాసవీనగర్ కాలనీ చౌరస్తాలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పైకప్పు తెరుచుకుంటుంది. వర్షం పడినప్పుడు ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు ఇక్కడకు చేరుతుంది. అక్కడ నుంచి నీళ్లు పోయేందుకు సరైన మ్యాన్‌హోల్స్ లేకపోవడంతో రోడ్డుపై ఆగిపోతున్నాయి. ఇది గమనించిన స్థానిక కాలనీవాసులు మ్యాన్‌హోల్ పైకప్పు తీసి పెడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇనుప మ్యాన్‌హోల్ ఏర్పాటు చేసి నీళ్ల నిల్వ ఉండకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



మల్లయ్యనగర్ చౌరస్తాలో తెరచి ఉంచిన మ్యాన్‌హోల్

ట్రాఫిక్ సమస్యపై సీపీ ఆరా



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఉప్పల్: ట్రాఫిక్ సమస్యపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉప్పల్ ట్రాఫిక్ అధికారులతో కలిసి సమీక్షించారు. సోమవారం కురిసిన వర్షానికి ట్రాఫిక్ సహా వాహనాల రాకపోకలను పరిశీలించారు. వర్షాకాలం సందర్భంగా ప్రజల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులతో ప్రతి రోజూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొన‘సాగుతున్న’ పనులు!

- నెల రోజులుగా రాకపోకలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో బాక్స్ డ్రెయిన్ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. దీంతో మై ఫ్లవర్ నుంచి జనప్రియ బస్టాప్ వరకు రాకపోకలు నెలరోజులుగా నిలిచిపోగా.. అన్నపూర్ణ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపారాలకు ఆటంకం..

ప్రతిరోజూ రాకపోకలు సాగించేవారు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. బాక్స్ డ్రెయిన్ పనులు నిలిచిపోవడంతో గత నెల రోజులుగా వ్యాపారాలు లేవని, అద్దె కట్టుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. నత్తనడక పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



అన్నపూర్ణ కాలనీలో ప్రమాదకరంగా డ్రెయిన్

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



ఉప్పల్: ఏళ్ల తరబడి పేరుకుపోయిన బ్యాంక్ కాలనీ వరద నీటి నాలా సమస్య పరిష్కారానికి సుమారు రూ. 70 లక్షలతో చేపడుతున్న వరద నీటి కాలువ పనులను సోమవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్, స్థానికులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. స్థానికులు బీఆర్ఎస్ నేతలు కొండల్‌రెడ్డి, జగన్, రామాంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

మౌలాలి: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మల్కాజ్‌గిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని మౌలాలిలో నూతనంగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాగా.. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా సైదయ్య నియమితులయ్యారు.

- మౌలాలి డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌కు తాత్కాలికంగా కేటాయించాలని మైనపల్లి కోరగా.. కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సానుకూలంగా స్పందించారని, దీంతో తాత్కాలిక భవనంలో మౌలాలి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.
- మౌలాలి ఎస్‌ఎచ్‌ఓ సైదయ్య మైనంపల్లి హనుమంతరావును సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుంచి వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయని ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు ముడుంబై వేంకటరమణాచార్యులు ప్రకటించారు. నేడు కోయిల్ అళ్వార్ తిరుమంజనం, సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, ధ్వజపటాదవాసం, చివరి రోజు 9న ఉత్సవాంత స్నపనం, అరవణి కైంకర్యం, శ్రీనివాస గద్యంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.





ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర ఆలయం, స్వామి వారి మూలవిరాట్